కమనీయం.. గోదాదేవి కల్యాణం

- తిరుప్పావై వ్రతసమాప్తిలో భాగంగా వేడుక
- స్వామివారికి వజ్రాభరణ కవచ అలంకరణ
- ఆకట్టుకున్న దీవీ హయగ్రీవాచారి వ్యాఖ్యానం




సంజీవనగర్ రామాలయంలో గోదాదేవి, రంగనాథస్వామి కల్యాణం నిర్వహిస్తున్న దృశ్యం

నంద్యాల(వ్యవసాయం): స్థానిక సంజీవనగర్‌లోని లక్ష్మీవెంకటేశ్వరస్వామి ఆలయంలో ధనుర్మాసం సందర్భంగా శ్రీభగవత్ సేవా సమాజ్ ఆధ్వర్యంలో గోదాదేవి రంగనాథస్వామి వారి కల్యాణాన్ని ఆదివారం కమనీయంగా నిర్వహించారు. ఉదయమే మూలవిరాట్‌కు సుప్రభాతసేవలు, పంచామృతాభిషేకాలు నిర్వహించి స్వామి వారిని వజ్రాభరణ కవచంతో ప్రత్యేకంగా అలంకరించారు. గోదాదేవి రంగనాథస్వామి ఉత్సవ మూర్తులకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కల్యాణోత్సవం వేదపండితులు శ్రీకాంత్‌శర్మ ఆధ్వర్యంలో వేదమంత్రాల సాక్షిగా శాస్త్రోక్తంగా నిర్వహించారు. కంకణ ధారణ, నలుగు, మాంగళ్య ధారణ తదితర కార్యక్రమాలు నిర్వహించి తలంబ్రాల తంతు పూర్తి చేశారు. అనంతరం స్వామి, అమ్మవార్లకు మహామంగళ హారతులు నిర్వహించారు. టీటీడీ బ్రహ్మోత్సవాల వ్యాఖ్యాత దీవీ హయగ్రీవాచారి గోదాదేవి కల్యాణం వ్యాఖ్యానం భక్తులను ఆకట్టుకుంది. పెళ్లి పెద్దలుగా వంకదారి చంద్రయ్య కుటుంబ సభ్యులు, ఇసనకర్ర వెంకటసుబ్బయ్య దంపతులు వ్యవహరించారు. ఈ కల్యాణం లోక కళ్యాణం కోసం తిరుప్పావై వ్రతసమాప్తిలో భాగంగా నిర్వహించడం జరిగింది. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు. సాయంత్రం గోదాదేవి అమ్మవార్లను గ్రామోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో భగవత్ సేవా సమాజ్ అధ్యక్షుడు సముద్రాల సూరయ్య, సభ్యుడు దేవరశెట్టి శ్రీనివాస్, వసంతరాఘువ, జయప్రకాష్, పద్మనాభయ్య, గురుమూర్తి, సాయికృష్ణ పాల్గొన్నారు.

» క్రాంతినగర్‌లోని శ్రీకాశిరెడ్డినాయన ఆశ్రమంలో సంక్రాంతి పండుగను పురస్కరించుకొని గోదాదేవి కల్యాణాన్ని ఘనంగా నిర్వహించారు. అనంతరం స్వామి, అమ్మవార్లను కాలనీలో గ్రామోత్సవం నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో అశోక్‌శర్మ, ప్రసాద్, శంకర్‌రెడ్డి, రమణారెడ్డి, భాస్కరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



శెట్టివీడులో కళ్యాణానికి శ్రీలక్ష్మీచెన్నకెశవస్వామి, శ్రీదేవి, భూదేవి విగ్రహాలను తీసుకెళ్తున్న ఉభయదారులు



క్రాంతినగర్‌లో కాశిరెడ్డినాయన ఆశ్రమంలో గోదాదేవి, రంగనాథస్వామిల కల్యాణం



మెయిన్ బజార్‌లోని అమ్మవారి శాలలో గోదాదేవి కల్యాణం

» మెయిన్‌బజార్‌లోని అమ్మవారి శాలలో ధనుర్మాన్ని పురస్కరించుకొని గోదాదేవి, రంగనాథ స్వామి కల్యాణాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు భవనాశి వాసు, వాసవీ మహిళా అధ్యక్షురాలు ఇందుమతి, శోభారాణి పాల్గొన్నారు.



అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న దృశ్యం

వైభవంగా లక్ష్మీచెన్నకేశవ స్వామి కల్యాణం

చాగలమర్రి: మండలంలోని శెట్టివీడు గ్రామంలో మకర సంక్రాంతి పండుగ పర్వదినాన భోగి సందర్భంగా ఆదివారం గ్రామంలో వెలసిన శ్రీలక్ష్మీచెన్నకేశవస్వామి, శ్రీదేవి, భూదేవి అమ్మవార్ల కల్యాణం గ్రామస్తులు అంగరంగ వైభవంగా నిర్వహించారు. 9 ఏళ్ల క్రితం ప్రతిష్ఠించిన స్వామి, అమ్మవార్ల విగ్రహాలకు మొదటి సారిగా మకర సంక్రాతి పండుగను పురస్కరించుకొని కళ్యాణాన్ని నిర్వహించనట్లు గ్రామ పెద్దలు తెలిపారు. ఈ సందర్భంగా శ్రీ బ్రహ్మంగారి మంఠం దేవస్థానం ప్రధాన అర్చకులు పోలేపల్లి రాబ్రహ్మాచారి శిష్య బృందం వారి వేదమంత్రోచ్చరణలతో ఉదయం సుప్రభాతసేవతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. అలాగే వేదపారాయణం, విశ్వక్షేణపూజ, గణపతిపూజ, బిందే తీర్థం, పంచామృత అభిషేకం విశేష పూజలను నిర్వహించారు. అనంతరం మధ్యాహ్నం శ్రీలక్ష్మీచెన్నకెశవస్వామి, శ్రీదేవి, భూదేవి సమేత కళ్యాణాన్ని, సాయంత్ర స్వామి వారికి గ్రామోత్సవాన్ని నిర్వహించారు.

క్లుప్తంగా

అనంతపురం ఎంపీని కలసిన వాల్మీకి నేతలు



ఎంపీని కలిసిన వాల్మీకి సంఘం నాయకులు

నంద్యాల(అర్బన్): అనంతపురం ఎంపీ తలారి రంగయ్యను ఆదివారం ఎంవీఆర్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు పులికొండన్న, నాగేశ్వరరావు కలిశారు. వ్యక్తిగత పని మీద నంద్యాల ఆర్అండ్‌బీ అతిథి గృహానికి విచ్చేసిన ఎంపీని వాల్మీకి సంఘం నేతలు మర్యాదపూర్వకంగా శాలువాతో సత్కరించారు. వారు మాట్లాడుతూ వాల్మీకి సంఘాభివృద్ధికి తలారి రంగయ్య విశేష కృషి చేస్తున్నారని, భవిష్యత్తులో సంఘం పురోగమనానికి మరింత కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు జయరాం, మధుగోపాల్, నారి, పరమేష్, హరినాథ్, రమేష్, సాయి తదితరులు పాల్గొన్నారు.

అలరించిన సీతారామ లక్ష్మణుల వేషధారణ

నంద్యాల(వ్యవసాయం): ఈనెల 22వ తేదీన అయోధ్య రామమందిరంలో ప్రాణప్రతిష్ఠ సందర్భాన్ని పురస్కరించుకొని వాసవీ మహిళా మండలి ఆధ్వర్యంలో సీతారామలక్ష్మణ వేషధారణలు ఆదివారం స్థానిక అమ్మవారి శాలలో అలరించాయి. వాసవీ మహిళా మండలి సభ్యురాలు ఇందుమతి, శోభరాణి ఆధ్వర్యంలో చిన్నపిల్లలచే సీతారామ లక్ష్మణ, ఆంజనేయస్వామి వేషాలు వేయించి పట్టణంలో ఎద్దుల బండ్లపైన గ్రామోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో వాసవి మహిళా మండలి సభ్యురాలు, ఆర్యవైశ్య సంఘం నాయకులు పాల్గొన్నారు.

ఆత్మీయ కలయిక



ఆత్మీయంగా మాట్లాడుకుంటున్న మహిళలు

దొర్నిపాడు: మండలంలోని రామచంద్రాపురం గ్రామంలో పూర్వ నివాసుల ఆత్మీయ సమ్మేళనాన్ని సూర్యకుమారీ, వెంకటేశ్వర్లు, ఎంవై నాయుడు ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. గ్రామంలో 1955 వరకు నివాసముండి వృత్తిరీత్యా వివిధ ప్రాంతాల్లో స్థిరపడ్డారు. సంక్రాంతి పురస్కరించుకొని పూర్వ నివాసులకు స్థానిక ఎంపీపీ పాఠశాలలో కలుసుకున్నారు.

సినీ రంగంలో సోగ్గాడు శోభన్‌బాబు



కేక్‌కట్‌చేసి సంబరాలు జరుపుకుంటున్న అభిమానులు

నంద్యాల(అర్బన్): సినీ వినీలాకాశంలో సోగ్గాడిగా శోభన్‌బాబు అభిమానుల మనసు దోచుకున్నారని శోభన్‌బాబు సేవా సమితి నంద్యాల జిల్లా అధ్యక్షుడు అన్నయ్య, కార్యదర్శి చింతలయ్య అన్నారు. శోభన్‌బాబు 88వ జయంతిని పురస్కరించుకొని పట్టణంలోని ఆర్‌ఎస్ రోడ్డులో అభిమానుల మధ్య కేక్ కట్ చేసి మిఠాయిలు పంచిపెట్టారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి చింతల మోహన్‌రావు, శోభన్‌బాబు సేవా సంఘం నాయకులు జానకీరాం, విజయ్‌బాబు, లక్ష్మయ్య, దస్తగిరి, అల్లాబకాష్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

జీఓ 512ను రద్దు చేయాలి

నంద్యాల(న్యూటౌన్): జీవో నం.512ను రద్దు చేయాలని సీపీఐ, ఏపీ రైతు సంఘం ఆధ్వర్యంలో ఆదివారం నిరసన కార్యక్రమం చేపట్టారు. సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి బాబాఫకృద్దీన్, పట్టణ కార్యదర్శి ప్రసాద్, ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సోమన్న మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం నియమించిన నీతి ఆయోగ్ ఆదేశాలకు అనుగుణంగా భూ హక్కు చట్టం అమలు పరిచేందుకు జీవో 512ను తీసుకొచ్చారన్నారు. దీనిని వెంటనే రద్దు చేయాలని వారు కోరారు. కార్యక్రమంలో శ్రీనివాసులు, సుబ్బరాయుడు, తదితరులు పాల్గొన్నారు.

ఆహ్లాదం కోసమే ఎగ్జిబిషన్



ఎగ్జిబిషన్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే శిల్పా

నంద్యాల(సిటీ): పట్టణ ప్రజలకు సంక్రాంతి పండుగను పురస్కరించుకుని ఏర్పాటు చేసిన పీఆర్ ఎగ్జిబిషన్ ఆహ్లాదాన్ని అందిస్తుందని ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిశోర్‌రెడ్డి అన్నారు. ఆదివారం స్థానిక ఎస్పీజీ ఎగ్జిబిషన్ మైదానంలో ఏర్పాటు చేసిన పీఆర్ ఎగ్జిబిషన్‌ను ఎమ్మెల్యే ప్రారంభించారు. తాజ్ మహల్‌ను పోలిన సెట్టింగ్ చూపరులను ఆకర్షిస్తుందని ఎగ్జిబిషన్ నిర్వాహకుడు ప్రభాకర్‌ను అభినందించారు.

ఆటో నగర్ వాసులకు నీటి కొరత ఉండదు

- ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిశోర్‌రెడ్డి
- రాజీవ్ గృహ సముదాయంలో రూ. 11.30 లక్షలతో పైప్ లైన్, పంప్ హౌస్ ప్రారంభం



పంప్‌హౌస్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే శిల్పా రవి



పార్టీలో చేరిన వారితో ఎమ్మెల్యే శిల్పా రవి

నంద్యాల(సిటీ): నంద్యాల ఆటో నగర్ పరిసర ప్రాంతాల వాసులకు ఇక నీటి కొరత ఉండదని, పట్టణంలోని అన్ని ప్రాంతాలకు నీటిని అందిస్తున్నమని ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిశోర్ రెడ్డి అన్నారు. ఆదివారం స్థానిక ఆటోనగర్ సమీపంలోని రాజీవ్ గృహకల్ప సముదాయం వద్ద ఏర్పాటు చేసిన పైప్‌లైన్, పంప్ హౌస్‌ను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ పట్టణ ప్రజలకు మౌలిక సదుపాయాల కల్పనకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. రాజీవ్ గహకల్ప సముదాయం, ఆటో నగర్ పరిసర ప్రాంత ప్రజలకు తాగునీటి కష్టాలను తొలగించేందుకు రూ.11.30 లక్షలతో పైప్‌లైన్, పంప్‌హౌస్‌తో పాటు మినరల్ వాటర్ ప్లాంట్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ షేక్ మాబున్నిసా, వైస్ చైర్మన్ గంగిశెట్టి శ్రీధర్, వ్యవసాయ మార్కెట్ యార్డు చైర్మన్ మహేశ్వర రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు వెంకటేశ్వరరెడ్డి, మనోహర్, భాస్కర్ రెడ్డి, లోకేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ నుంచి 200మంది వైఎస్సార్‌సీపీలో చేరిక

నంద్యాల(అర్బన్): పట్టణంలోని 40వ వార్డుకు చెందిన 200మంది యువకులు నంద్యాల ఎమ్మెల్యే శిల్పా రవిచంద్ర కిశోర్‌రెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ గంగిశెట్టి శ్రీధర్‌ల ఆధ్వర్యంలో ఆదివారం టీడీపీని వీడి వైఎస్సార్‌సీపీలో చేరారు. ఎమ్మెల్యే శిల్పారవి స్వగృహంలో నాయకులు అల్తాఫ్, మిత్ర బృందానికి ఎమ్మెల్యే కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీలో చేరిన ప్రతి ఒక్కరూ ఒకే కుటుంబంగా ఉన్నామని, పార్టీ బలోపేతానికి కృషి చేయాలన్నారు. రానున్న ఎన్నికల్లో రాష్ట్రంలో జగన్‌మోహన్‌రెడ్డి తిరిగి అధికారం చేపట్టేలా ప్రతి కార్యకర్త సైనికుల్లా పని చేయాలన్నారు. గత 20ఏళ్లుగా శిల్పాకుటుంబం నంద్యాల ప్రజలకు సేవలు చేస్తూ వస్తుందని, మూడు సార్లు ఎమ్మెల్యేగా, మంత్రిగా శిల్పా కుటుంబాన్ని నంద్యాల ప్రజలు ఆదరించారన్నారు. కార్యక్రమంలో ఏపీఎస్పీడీసీఎల్ డైరెక్టర్ శశికళారెడ్డి, వైఎస్సార్‌సీపీలో చేరిన ఖాదర్ షహన్‌షా, ఫారూక్, ఫయాజ్, శ్రీకాంత్, నాగూర్‌వలి, కోటలింగం, అత్తర్, సికిందర్, ముంతాజ్, శివ, షహనాజ్, సుధాలక్ష్మి, నారాయణమ్మ తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయ విద్యుత్ వేళలు

ఉయ్యాలవాడ : మండలంలోని రైతులకు పగటిపూట 7 గంటలు ఉచిత విద్యుత్ సరఫరా చేస్తున్నట్లు ట్రాన్స్‌కో ఏఈ గురప్ప తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ సోమవారం నుంచి వారం రోజుల పాటు కొండుపల్లె, ఇంజేడు, అక్కంపల్లె, హరివరం, ఎస్.కొత్తపల్లె ఫీడర్ల పరిధిలోని గ్రామాలకు ఉదయం 8 నుంచి సాయంత్రం 3 గంటల వరకు, మాయలూరు, సుద్దమల్ల ఫీడర్ల కింద ఉన్న గ్రామాలకు ఉదయం 11 నుంచి సాయంత్రం 6 గంటల వరకు త్రీఫేజ్ విద్యుత్ సరఫరా చేస్తామని వివరించారు.

సమస్యలు పరిష్కరిస్తున్నందుకే ధైర్యంగా మీ ముందుకు



సమస్యలను అడిగి తెలుసుకుంటున్న ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి

- ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి
- కొండుపల్లెలో 'గడప గడపకు మన ప్రభుత్వం'

ఉయ్యాలవాడ : ప్రజల సమస్యలు పరిష్కరిస్తున్నందుకే ధైర్యంగా గడప గడపకు వెళ్తున్నామని ఆళ్లగడ్డ ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని కొండుపల్లె గ్రామంలో విజయ మిల్క్ డెయిరీ చైర్మన్ ఎస్‌వీ జగన్‌మోహన్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు బుడ్డా చంద్రమోహన్ రెడ్డి, గ్రామ నాయకులు అంబటి తులసిరెడ్డి, అంబటి సుబ్బారెడ్డి, క్రిష్టిపాడు శేఖర్‌రెడ్డి, వెంకటేశ్వరరెడ్డిలతో కలిసి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ఆప్యాయంగా పలకరిస్తూ సంక్షేమ పథకాల లబ్ధి గురించి ఆరా తీశారు. ఏమైనా సమస్యలు ఉన్నాయా అంటూ ప్రజలను అడిగి తెలుసుకున్నారు. ప్రజలు ఆయన దృష్టికి తీసుకొచ్చిన సమస్యలపై అక్కడే అధికారులతో చర్చించి పరిష్కారానికి చర్యలు తీసుకున్నారు. మరి కొన్ని సమస్యలు వీలైనంత త్వరగా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. పింఛన్లు, అమ్మ ఒడి, రైతు భరోసా, జగనన్న విద్యా దీవెన, వసతి దీవెన, ఆరోగ్య శ్రీ, ఇంటి నిర్మాణాలు, సున్నా వడ్డీ రుణాలు, ఇళ్ల మంజూరుపై ఆరా తీశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. సంక్షేమ పథకాల ద్వారా లక్షలాది కుటుంబాలు ఆర్థికంగా బలోపేతం అవుతూ ఉంటే ప్రతిపక్షాలకు ఇవేమీ కనిపించడం లేదని విమర్శించారు. త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో ఓటు అనే ఆయుధంతో ప్రజలు టీడీపీ నాయకులకు బుద్ధి చెబుతారన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ఉమామహేశ్వరరావు, పంచాయతీ కార్యదర్శి అబ్దుల్ రహీమ్, జేఏసీ కన్వీనర్ లాలమ్మగారి హుసేనయ్య(బుజ్జి), ఆళ్లగడ్డ మార్కెట్ యార్డ్ డైరెక్టర్ గజ్జెల కృష్ణారెడ్డి, సర్పంచ్ పల్లె గురుప్రసాద్‌రెడ్డి, మాజీ గ్రామ సర్పంచ్‌లు ఆరికట్ల శివరామక్రిష్ణారెడ్డి, నాయకులు శింగం వెంకటేశ్వరరెడ్డి, కందుల వెంకటసుబ్బారెడ్డి, కూలూరు రామక్రిష్ణారెడ్డి పాల్గొన్నారు.

పార్వేట ఉత్సవాలకు సహకరించండి

రుద్రవరం: పార్వేట ఉత్సవాలకు అందరూ సహకరించాలని స్థానిక భాస్కర నందీశ్వర స్వామి ఆలయ నిర్వాహకులు ఏర్వ కృష్ణమూర్తి తెలిపారు. ఆదివారం ఆయన తెలిపిన వివరాల మేరకు ప్రతి ఏటా సంక్రాంతి పండుగ సందర్భంగా స్వామి వారి ఉత్సవ మూర్తికి పార్వేట ఉత్సవం నిర్వహిస్తున్నామని, అప్పట్లో యువకులకు పరుగు పోటీలు నిర్వహించేవారన్నారు. అయితే ఆ పోటీల్లో ఇతరులు తాము పోటీ పడుతామని వచ్చి వాగ్వాదానికి దిగేవారని, అలా జరగకుండా ఉండేందుకు ఈ ఏడాది ఆలయ కమిటీ నిర్వాహకులు ముందస్తు చర్యలు తీసుకున్నారని చెప్పారు. ఇందులో భాగంగా ఈ నెల 16న మంగళవారం నిర్వహించే పార్వేట ఉత్సవాల పరుగు పోటీల్లో మేజర్ పంచాయతీ రుద్రవరం, మజరా గ్రామాలు రెడ్డిపల్లె, తువ్వపల్లె గ్రామాలకు చెందిన యువకులు మాత్రమే పోటీల్లో పాల్గొనేలా తీర్మానం చేసినట్లు తెలిపారు. ఇందుకు అందరు సహకరించాలని కోరారు.

జిల్లా స్థాయి బ్యాడ్మింటన్ పోటీలు

నంద్యాల(న్యూటౌన్): నంది పైప్స్ బ్యాడ్మింటన్ అకాడమీలో ఆదివారంలో నంద్యాల జిల్లా స్థాయి బ్యాడ్మింటన్ ఓపెన్ అండ్ 40 ప్లస్ పురుషుల డబుల్స్ టోర్నమెంట్ పోటీలు అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. నంద్యాల జిల్లా వ్యాప్తంగా వివిధ ప్రాంతాల నుంచి 100 మందికి పైగా క్రీడాకారులు పాల్గొన్నారు. నంది గ్రూప్ ఆఫ్ కంపెనీ డైరెక్టర్ ఎస్.సుజల మాట్లాడుతూ.. ప్రతి కేటగిరిలో ప్రథమ, ద్వితీయ, తృతీయ, నాల్గవ స్థానాల్లో గెలిచిన విజేతలకు ట్రోఫీలు, నగదు బహుమతులను అందజేశారు. దిశ డీఎస్పీ మారుతిరావు, తహసీల్దార్ రవికుమార్, ఏపీ బ్యాడ్మింటన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వంశీధర్, దాల్‌మిల్ అమీర్, విద్యాసాగర్‌రెడ్డి, టోర్నమెంట్ కార్యదర్శి శేషిరెడ్డి, శేఖర్‌బాబు విజేతలకు బహుమతులను అందజేశారు.

వ్యక్తి ఆత్మహత్య

ఆళ్లగడ్డ : రూరల్ మండలం కోటకందుకూరు గ్రామానికి చెందిన ప్రసాద్ (43) పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. రూరల్ ఎస్సై నరసింహులు తెలిపిన వివరాల మేరకు ప్రసాద్ తనకున్న 4 ఎకరాల పొలంతో పాటు మరో 10 ఎకరాలు కౌలుకు తీసుకుని సాగు చేస్తున్నాడు. ఈ క్రమంలో అప్పులు అధికం కావడంతో మనస్తాపం చెంది ఆదివారం ఉదయం ఇంట్లో ఎవరు లేని సమయంలో పురుగుల మందు తాగాడు. ఇంటికి వచ్చిన కుటుంబ సభ్యులు గమనించి పట్టణంలోని ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా కోలుకోలేక మృతి చెందాడు. భార్య నాగలక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు

ఆనందోత్సాహాలతో భోగి వేడుకలు



ఎద్దుల బండిపై విహరిస్తున్న మహిళలు



భాగ్యనగరంలో భోగి మంటలు వేసిన దృశ్యం

నంద్యాల(వ్యవసాయం): పట్టణంలో పిల్లలు, పెద్దలు సంక్రాంతిని పురస్కరించుకొని ఆదివారం భోగి వేడుకలను ఆనందోత్సాహాలతో జరుపుకున్నారు. తెల్లవారుజామునే ఇంటి ముందు భోగి మంటలు వేసి, కల్లాపు చల్లి రంగురంగుల ముగ్గులను వేసి గొబ్బెమ్మలను పూలతో అలంకరించారు. ఉదయాన్నే మంగళస్నానం ఆచరించి అనంతరం సద్దబొట్టెలు, వివిధ రకాల కూరగాయలతో కూరలు వండి స్వామి వారికి నైవేద్యం సమర్పించారు. అనంతరం భక్తులు గుమ్మడి కాయలతో ఇంటికి దిష్టితీసి పగలగొట్టారు. సాయంత్రం చిన్నపిల్లలకు రేగిపండ్లు, చెరుకు ముక్కలు, బొక్కెట్లు, చిల్లర నాణేలు వేసి ఆశీర్వదించారు. గంగిరెద్దుల వారికి, హరిదాసులకు మహిళలు దానాలు చేశారు. బార్ అసోసియేషన్ కార్యాలయంలో న్యాయవాదులు భోగిమంటలు వేసుకున్నారు.

శిరివెళ్ల/దొర్నిపాడు: సంక్రాంతి సంబరాలలో భాగంగా గ్రామ గ్రామాన, వాడ వాడలా ప్రతి ఇంటి ముందు గొబ్బెమ్మలు ఏర్పాటు చేసి మహిళలు పూజలు చేశారు. తెల్లవారు మూమూ నుంచే భోగి మంటలు వేశారు. ఇళ్ల ముందర రంగు రంగుల ముగ్గులు వేయడంతో పండుగ శోభ వెలుగొంది.

సంక్రాంతి ముగ్గులు సంస్కృతికి చిహ్నాలు



ముగ్గులను పరిశీలిస్తున్న సీఐ రమేష్‌బాబు

ఆళ్లగడ్డ: సంక్రాంతి ముగ్గులు మన సంస్కృతి, సంప్రదాయాలకు చిహ్నాలని ఆళ్లగడ్డ పట్టణ సీఐ రమేష్‌బాబు అన్నారు. సంక్రాంతి మహోత్సవాల్లో భాగంగా స్థానిక ఆదాల కాలనీలో కాళికామాత దేవాలయ ఆవరణలో ఆలయ పాలకమండలి ఆధ్వర్యంలో ఆదివారం ముగ్గుల పోటీలు నిర్వహించారు. కార్యక్రమానికి ప్రత్యేక ఆహ్వానితులుగా హాజరైన సీఐ రమేష్‌బాబు సంబరాల్లో పాల్గొన్నారు. అనంతరం ముగ్గుల పోటీలను పరిశీలించారు. కార్యక్రమంలో ప్రైవేటు పాఠశాలల డివిజన్ అధ్యక్షుడు అమీర్‌బాషా, శిల్పి దురిగడ్డ రమేంద్రాచారి, వైస్ ప్రిన్సిపల్ గంగన్న ఉన్నారు.